క్లుప్తంగా

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన



మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో హైదరాబాద్ సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు వినియోగదారుల హక్కుల చట్టంపై మహిళ సంఘాల సభ్యులకు ఆదివారం అవగాహన కల్పించారు. నాటక ప్రదర్శన, చార్టు పోస్టర్లతో వస్తువులు కొన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి హక్కులను వివరించారు. కార్యక్రమంలో శృతి, సమీక్ష, అఖిల, సుమ, లాస్య, మౌలిక, సమీన, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన బొడ్రాతి గట్టయ్యనాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.5 వేల ఆర్థికసాయాన్ని పంపించడంతో నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నగదును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు, సింగోటం దాసునాయుడు, నవీద్, రాఘవేందర్, బొల్లేదుల రాజు పాల్గొన్నారు.

తిరుమలలో కనిమెట్ట భజన మండలి సభ్యులు



కొత్తకోట రూరల్: తిరుమలలో నిర్వహించిన అఖండ భజన కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని కనిమెట్టకు చెందిన 16మంది సీతారాముల భజన మండలి సభ్యులు శనివారం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం అఖండ భజన కార్యక్రమంలో పాల్గొని సంకీర్తనలు, పారాయణం చేశారు. తమ భజన బృందం దేవస్థానాల్లో సంకీర్తనలు చేయడం అలవాటుగా వచ్చిందని, తిరుమలలో సంకీర్తనలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని సభ్యులు తెలిపారు. భజన కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, వాకిటి పరశురాం, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, నీలవర్ధన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, పారిజాతమ్మ, భాగ్యమ్మ, బాలపెంటన్న, కుర్మన్న, ఆంజనేయులు, భాగ్యమ్మ, అంజలన్న

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గతంలో విరాళంగా ప్రకటించిన రూ.లక్ష ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నేతలకు పంపించారు. నగదును జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్ హిందూవాహిని సభ్యులకు అందజేశారు. హిందూవాహిని సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, భీంరెడ్డి, ఆకుల శ్రీనివాసులు, జగన్‌మోహన్‌రెడ్డి, అద్వానీ శ్రీను, రవీందర్‌రెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచ్‌కు సన్మానం

ఖిల్లాఘనపురం: సమాజంలో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావించాలని ఎంపీపీ కృష్ణనాయక్ అన్నారు. మండలంలోని దొంతికుంటతండా సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించి ఇటీవలే పదవీకాలం ముగిసిన పీనానాయక్ దంపతులకు ఆదివారం తండావాసులు శాలువాలు, గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దొంతికుంటతండా సర్పంచ్‌గా పీనానాయక్ మూడు పర్యాయాలు ఎన్నిక కావడం సంతోషించమన్నారు. సర్పంచుగా తండావాసులకు అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరవరన్నారు. ఇంతటితో ఆగకుండా మునుముందు మరిన్ని పదవులు అధిరోహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, తిర్పతి తదితరులు పాల్గొన్నారు.



వరికి తెగుళ్ల బెడద

- ఎండుతున్న మొక్కలు
- పెరుగుతున్న పెట్టుబడి వ్యయం
- ఆందోళనలో అన్నదాతలు



రేవల్లి మండలం చీర్కపల్లిలో వరి పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ (ఫైల్)

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని వరి పంటలను తెగుళ్లు వెంటాడుతున్నాయి. మండలంలో వానాకాలంలో 12,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ యాసంగి నాటికి కేఎల్‌ఐ కాల్వల్లో నీటి సరఫరా నిలిచిపోవడంతో పాటు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో కేవలం 8,200 ఎకరాల్లో వరి సాగుచేశారు. అలాగే రేవల్లి మండలంలో వానాకాలంలో 8,900 ఎకరాల్లో.. యాసంగిలో 4,500 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. యాసంగి వరిపంట సాగు చేసి సుమారు నెల నుంచి రెండు నెలలు కావస్తోంది. ప్రస్తుతం వరి పంటలు ఎక్కడ చూసినా కాండం తొలుచు పురుగు, ఆకుముడుత, అగ్గితెగులు, జింకులోపం, సల్ఫేడ్ దుష్ప్రభావం వంటి తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో మందులు పిచికారీ చేయాల్సి రావడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. అయినా పంట చేతికొస్తుందో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మందుల వాడకంలో జాగ్రత్తలు

రైతులు తెగుళ్ల నివారణ కోసం ఇష్టారీతిన మందులు పిచికారీ చేయకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఓ సూచించారు. కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు ఆశించినట్లయితే పంట నాటిన 15 నుంచి 40 రోజుల దశలో ఉన్న పైర్లలో కార్బోఫ్యూరాన్ 3జీ 10కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ నాలుగు కిలోలు ఎకరానికి 25కిలోలు పొడి ఇసుకతో కలిపి చల్లాలన్నారు. అంకురం ఏర్పడే దశ నుంచి చిరు పొట్ట దశలో రెక్కల పురుగులు గమనించినట్లయితే ఒక ఎకరానికి 60 మి.లీ క్లోరంట్రానిలిప్రోల్ లేదా 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా వంద మి.లీ టెట్రానిలిప్రోల్ పిచికారీ చేయాలి. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా కసుగమైసిన్ 2.5 ఎంఎల్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వరి చేలు ఎండిపోతున్నాయి

వరి పంట వేసి ఇప్పటికీ సుమారు రెండు నెలలు కావస్తోంది. పంట చివరన ఎర్రగా మారి మొక్క ఎండితుంది. వాతావరణంలో మార్పులు రావడం వల్ల ఇలా జరుగుతోందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మందులు వాడినా తెగులు తగ్గట్లేదు. దీంతో పెట్టుబడి వ్యయం పెరుగతోంది.

– బోడ్కొల్ల మణ్యం, రైతు, గోపాల్‌పేట

అధికారుల సూచన పాటించాలి



యాసంగిలో తెగుళ్ల సమస్య అధికంగానే ఉంది. రైతులు నేరుగా ఫర్టిలైజర్ షాపులకు వెళ్లి వారు ఇచ్చే మందులు గుడ్డిగా వాడి మోసపోవద్దు. స్థానికంగా ఉండే వ్యవసాయ అధికారికి సమస్య చెప్పి వారి సూచన మేరకు మందులు వాడితే రైతుల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. పంటల దిగుబడి సైతం పెరిగే అవకాశం ఉంటుంది.

– అనిల్‌కుమార్, ఏఓ, రేవల్లి

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

వీపనగండ్ల: కేంద్రంలో అధికారాన్ని చలాయిస్తున్న భారతీయ జనతా పార్టీ సామాన్య ప్రజలు, రైతుల బాగోగులను పట్టించుకోకపోవడంలో ఘోరంగా విఫలమైందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన గుణపాఠాన్ని నేర్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాన్ని తొలగించాల్సింది పోయి కులమతాల మధ్య తారతమ్యాలను సృష్టించి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తుందని దుయ్యబట్టారు. న్యాయమైన హక్కుల కోసం దేశ రాజధానిలో శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న రైతులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజల హక్కులను హరిస్తున్న బీజేపీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం నేర్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గాంధీ విగ్రహం తొలగేనా?



రోడ్డు మధ్యలో గాంధీ విగ్రహం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుపై గాంధీ విగ్రహం ఉండటంతో ప్రతి నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డు విస్తరణ సమయంలో గాంధీ విగ్రహాన్ని రోడ్డు మధ్య నుంచి తొలగించి గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసేందుకు దిమ్మె నిర్మించినా.. నేటికీ విగ్రహన్ని తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. గ్రామపంచాయతీ వారు విగ్రహాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చినా.. పంచాయతీ పాలకమండలి సభ్యుల గడువు ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారులు స్పందించి రోడ్డు మధ్యలోని గాంధీ విగ్రహన్ని తొలగించి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇష్టంతో చదివితే సత్ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గమనం

ఆత్మకూర్: విద్యార్థులు ఇష్టంతో చదివితేనే సత్ఫలితాలు సాధ్యమని, బట్టీ చదువులకు స్వస్తి పలకాలని ప్రముఖ మానసిక నిపుణుడు, ఎన్‌ఎల్‌పీ ట్రైనర్ ఎస్ గమనం అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని శ్రీవాణిహైస్కూల్లో 9, 10వతరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలు వస్తున్నాయని భయపడకుండా.. ధైర్యంగా ఉండి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించేస్థాయికి ఎదగాలని అభిలాషించారు. అలాగే విద్యార్థులు ఒత్తిడిని ఎలా జయించాలి, పరీక్షలకు సన్నద్ధత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అడ్వయిజర్ టీజే విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు లత, శ్రీమాలి, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని సీఈఓ భాస్కర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్తా ధర రూ.270 చెల్లించి కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి యూరియాను పొందవచ్చని ఆయన తెలిపారు. రైతులు ఎరువులను బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసి నష్టపోవద్దని, సింగిల్ విండో కార్యాలయంలోనే కొనుగోలు చేయాలని కోరారు.

చలో సచివాలయం విజయవంతం చేయండి

పెబ్బేర్ రూరల్: ఈనెల 20న నిర్వహించే సెక్రటేరియట్ ముఖ్యమంత్రిని కలుద్దాం.. వినతిపత్రం ఇద్దాం అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీప నైవేద్య అర్చకులకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటుకొత్తగా నియామకమైన డీడీఎన్‌ఎస్ అర్చకులకు 7 నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. పాత డీడీఎన్‌ఎస్ అర్చకులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశఋరు. అర్చకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు నటరాజు, ప్రధాన కార్యదర్శి రవీందర్, మండల ఇంచార్జులు పాల్గొన్నారు.

అధ్వానంగా రామన్‌పాడు దారి



ఆత్మకూర్ నుంచి రామన్‌పాడు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముల్లపొదలు

- రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు
- గుంతలతో ప్రమాదాలు
- నిధులు పక్కదారి

ఆత్మకూర్: పట్టణం నుంచి రామన్‌పాడ్ ప్రాజెక్టుకు వెళ్లే మార్గం అధ్వాన్నంగా మారింది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఆ రోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరువైపులా ముల్లపొదలు రోడ్డును కప్పివేయండంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డంతా గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇది వరకే ముల్లపొదల తొలగింపు, మరమ్మతు కోసం రూ.లక్షల నిధులు మంజూరైన పనులు చేయకుండానే ఆ నిధులను పక్కదారి పట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పీజేపీ అధికారులు స్పందించి రోడ్డను బాగు చేయడంతో పాటు ముల్లపొదలను తొలగించాలని కోరుతున్నారు. కలెక్టర్ స్పందించి నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అమడబాకులలో కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, గ్రామస్తులు

కొత్తకోట రూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని అమడబాకులలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కార్యక్రమానికి జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ ముఖ్య అతిథిగా వైద్య శిబిరం ప్రారంభించారు. గ్రామంలో 200మందికి కంటి పరీక్షలు చేయగా వీరిలో 107మంది అద్దాలు ఉచితంగా అందించామని, 43 మందికి చుక్కలు వేయడంతో పాటు శస్త్ర చికిత్స కోసం 50మందిని గుర్తించామని డాక్టర్ పాదిలా శ్రీధర్, సత్యసాయి సేవాసమితి సభ్యులు తెలిపారు. ఈనెల 22వ తేదీన 30 మందికి హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని డాక్టర్ వివరించారు. వచ్చే నెలలో మరోసారి గ్రామంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, అప్పుడు గ్రామస్తులందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యారెడ్డి, రాంరెడ్డి, మన్యం, రంగారెడ్డి, లక్ష్మణ్, రామస్వామి, వెంకటయ్య, శ్రీను, కావలి తిరుపతయ్య, కొల్లంపల్లి తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌లో తూడి లక్ష్మమ్మ ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగనూర్ గ్రామానికి చెందిన తూడి లక్ష్మమ్మ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో నిద్రించింది. తెల్లవారుజామున లేచి చూసే సరికి ఇంటి, బీరువా తాళాలు విరగొట్టి బీరువాలో ఉన్న 20 గ్రాముల బంగారం, వెండి నగలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కవులు

వనపర్తి టౌన్: హైదరాబాద్ కేంద్రంగా దేశవ్యాప్తంగా దళిత ఉద్యమానికి ఊపిరిపోసిన భాగ్యరెడ్డి వర్మ పోరాటాలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 85వ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే దళితులు అభివృద్ధి చెందుతారని హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించారని గుర్తుచేశారు. ఉద్యమకారుడిగా, హక్కుల కార్యదర్శిగా, రచయితగా, పాత్రికేయుడిగా, సంఘ సంస్కర్తగా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, కవి గిరిరాజాచారి, తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, మైనార్టీ సంఘం జిల్లా నాయకుడు బాలేమియా, యూటీఎఫ్ జిల్లా నాయకులు వెంకటేష్, రాంబాబు, తిమ్మప్ప, జిల్లా దళిత సంఘం నాయకుడు పానుగంటి యోసేపు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరచారి, నాయకులు సత్యం చారి, గంగాధర్‌చారి, నాగరాజు చారి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



ఆదిశిలా క్షేత్రంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్‌ను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు



నారాయణపురంలో..

మానవపాడు: నారాయణపురం బా లయోగి శివనారాయణస్వామి ఆశ్రమంలో ఆది వారం రామసత్య నారాయణస్వామి సుదర్శన హో మం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నారాయణస్వా మి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని అఖండ భజనాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. సోమ వారం రామసత్య నారాయణస్వామి వ్రతం, రథో త్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్నాపురం గ్రామానికి చెందిన రూప సంపత్‌కుమార్ దంపతులు శివస్వాములతో కలిసి శివుడికి పంచామృతాలు, పండ్ల రసాలు, విభూదితో అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు మల్లన్న, దర్శెల్లి, ధరూరు రవి, సీతారాములు, స్వాములు గోపిరెడ్డి, కారం రవి, కిష్టన్న, సాయి, మున్నా, ఈశ్వర్, ఆంజనేయులు, సవారన్న పాల్గొన్నారు.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆదివారం గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి మెమోంటో అందజేశారు.

మల్లెలమ్మ ఉత్సవాలు



కొల్లాపూర్: పట్టణ సమీపంలోని మల్లెలమ్మ ఉత్సవాలను మహేంద్ర(మ్యాదరి) కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మహేంద్ర సంఘం అధ్యక్షుడు పిన్నంశెట్టి బాలు, నాయకులు ప్యారసాని మురళి, పులి భరత్, సుధాకర్, వెంకటస్వామి, బాలయ్యతో పాటు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

'సీసీ' పనులు ప్రారంభం

ఖిల్లాఘనపురం: మండలంలోని ఆగారంలో ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.9 లక్షలు మంజూరయ్యాయని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మున్నూరు జయకర్ తెలిపారు. గ్రామంలో ప్రధానంగా ప్రజలకు అవసరం ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్డు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణయ్య, రామకృష్ణ, శ్రీకాంత్, కుర్మయ్య పాల్గొన్నారు.



మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధికం సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు కుటుంబసభ్యులతో తరలి వచ్చారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదువేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై ముందుచూపు

- నేటితో ముగియనున్న విటమిన్–ఏ ద్రావణం పంపిణీ



చిన్నారికి విటమిన్ ఏ ద్రావణం తాగిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పాన్‌గల్: చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడంతో పాటు కంటి సమస్యలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే పిల్లలకు విటమిన్ ఏ ద్రావణం అందిస్తోంది. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఆశా కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చిన్నారులకు ద్రావణం వేస్తున్నారు.

ప్రయోజనాలివీ..

నేత్ర సంబంధిత సమస్యలు ప్రధానంగా రేచీకటి, కంటిలో మచ్చలు బిటాట్‌స్పాట్స్ ముందుగానే నివారించవచ్చు. అమ్మతల్లి, చికెన్‌పాక్స్‌కు సంబంధించిన ఆరోగ్య సమస్య నివారణకు సమర్థంగా పనిచేస్తుంది. విటమిన్ 'ఏ' ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలైన తాజా ముదురు ఆకుపచ్చరంగు ఆకుకూరలు, మామిడి, బొప్పయిపండ్లు, క్యారెట్, గుమ్మడికాయ, పాలు, వెన్న, నెయ్యి, గుడ్లు, చేపలు, కోడి మాంసాన్ని చిన్నప్పటి నుంచి అలవాటు చేయాలి. అన్ని టీకాలను సరైన సమయంలో అందిస్తూ జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలని వైద్యులు సూచించారు. పిల్లలు అందరితో ఆడుకునేటట్లు చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపుతూ పిండి పదార్థాలను తగ్గిస్తూ ఆహారంలో ప్రోటీన్లు ఉండేటట్లు చూసుకోవాలి. చిన్నారులకు విటమిన్ 'సి' ఉన్న పండ్లు, ఆకుకూరలు తినిపించాలి.

విటమిన్ 'ఏ' ద్రావణం ఎవరెవరికి..

తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఆరు నెలలకు ఒకసారి విటమిన్ 'ఏ' ద్రావణం తాగించాలి. మండలంలో 9 నెలల నుంచి 12 నెలల వరకు చిన్నారులు 734, సంవత్సరం నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 2,773 మంది ఉన్నట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఈ ద్రావణం వైద్యారోగ్యశాఖ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే ఉంటుంది. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేటప్పుడు దీన్ని ఇస్తారు. ఈ ద్రావణం ఇచ్చి ఒక నెల పూర్తయితే మళ్లీ తాగించవచ్చు. ఆయా వయస్సు గల చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం తాగించేలా తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్‌రెడ్డి సూచించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కొత్తకోట రూరల్: ఆత్మరక్షణ కోసం కరాటే ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జే బోయేజ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పాత జూనియర్ కళాశాల ఆవరణలో షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విదార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బోయేజ్ మాట్లాడుతూ కరాటేలో శిక్షణ పొందడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక ధృడత్వం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు కరాటే ఎంతో అవసరమన్నారు. క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, భరత్‌భూషణ్, లతీఫ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సలీంఖాన్, యండి.బాబా, సాజిద్ అలీ, సీనియర్ కరాటే మాస్టర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

